# "మీరు చచ్చినా రాష్ట్రం రాదు"

మెల్లగా తలుపు తట్టాను. నిద్రలోంచి లేచిన స్వామి తలుపు తీసాడు.

"రండి! మీరా! ఎవరో అనుకున్నానుగాని తర్వాత మీరేనని అనిపించింది. తలుపు తీసేలోపల."

స్వామి ఆహ్వానించాడు. కుర్చీలో కూచుంటో "ఎంచేత?" అన్నాను.

"ఇంకొకరైతే దబ్బుదబ్బున పిడుగుల వర్షం కురుస్తున్నట్టు తలుపు బాదైనా ఉందురు. లేదా ఏ కిటికీ సందులో నించో "ఏమండోయ్ స్వామిగారో" అని "నిద్రపోతున్నవాణ్ణి హడలిపోయేలా పిల్చి ఉందురు."

బ్రష్, పేస్టుకోసం వెతుక్కుంటూ అన్నాడు. ఆయన వర్ణన చూస్తుంటే నాకు నవ్వొచ్చింది.

ఓ పది నిమిషాల్లో తిరిగొచ్చాడు.

"ఏదో ఆదివారంకదూ? అంచేత..." అడగని క్షమాపణలు చెప్పుకుంటున్నాడు.

"ఎందుకూ వుత్తినే ధంజం తడముకుంటారు. మిమ్మల్ని నేనేం అనలేదే?"

మధ్యలో ఆపాను. స్వామి వాక్యంకూడా అక్కడే ఆగిపోయింది. చొక్కా పొడుగు చేతులు మడుచుకుంటో, కుర్రాణ్ణిపిల్చి ఫ్లాస్కు యిచ్చి, వొచ్చి కూచున్నాడు.

"మీతో ఓ ముఖ్యవిషయం చెప్పడానికి వొచ్చాను" అన్నాను.

"ఏమిటది? ఏం కొంపమునిగింది?"

"నిన్న రాత్రి రేడియో విన్నారా?"

"లేదు"

"పోనీ ఈవేళ పేపరు చూశారా?"

"లేదు"

"కనీసం - ఎవరన్నా చెబుతుంటే విన్నారా?"

"లేదు"

కోపంతో నా ముఖం కందసాగింది.

"మరింకేం చేస్తున్నారు?" అన్నాను కోపంగా.

"నిద్రపోతున్నాను" అన్నాడు శాంతంగా.

"నిద్రబోతున్నారా? ఫర్వాలేదు! నిద్రపొండి! అన్నీ పదిలంగానే ఉన్నాయి. మరేం భయంలేదు. మీరొక్కరేకాదు. మనమంతా ఆంధ్రజాతి అంతా యుగయుగాలు, ప్రపంచం ఉన్నంత కాలం, ఖగోళాలు ఢీకొని విశ్వమంతా భగ్నమయ్యేదాకా. అందరం నిద్రపోదాం! గౌతమీ పుత్రశాతకర్ణి దగ్గరనించి హంపీక్షేత్రంలో శిధిలమైన విజయనగర సామ్రాజ్యపు ఔన్నత్యంవరకూ వెలిగిన ప్రతిభ – ఇటలీ మొదలైన విదేశాలతో వ్యాపారాన్నీ సాగించిన ఆంధ్ర చరిత్ర – వీధుల్లో ఆణిముత్యాల్ని అమ్మగలిగిన తెలుగు దేశపు గొప్పతనం – కవితాకన్యక్కి కనకాభిషేకాలు చేయించిన, గండపెండేరాలు తొడిగించిన తెలుగుజాతి వెలుగు అన్నీ చాలా జాగర్తగా, పదిలంగా పుస్తకాల్లో రాసివున్నాయి! గతంలో మన తాతలు నిర్మించిన చరిత్ర చాలు మనకి!! ఇప్పుడు మన మూతులు వాసనచూడమందాం!!"

ఏం మాట్లాడుతున్నానో వుద్రేకంలో నాకే తెలీదు. అన్నాళ్ళు మనలో అణగారిన వ్యథ, బాధ, అగ్నిపర్వతం పగిలినట్టు వెల్లువలై పారసాగింది.

"అసలు సంగతేమిటి?" అన్నాడు స్వామి. ఒక చిరునవ్వుతో నన్ను ఆపి. చటుక్కున.

"ఏమీ లేదు!" ఊరుకున్నాను.

"ఎవరిమీద ఆ కోపం ?"

"దేవుడిమీద. ఎంత గొప్ప చరిత్ర ఉంటేనేం? ఎంత విశాలహృదయులమనుకుంటేనేం? ఎంత మేధావంతులమని గర్విస్తేనేం? ఆంధ్రులమంటే ఎందుకూ పనికిరానివాళ్లమన్నమాట!"

నాకు వొళ్ళు మండింది! ఎన్నడూలేని పెసిమిజం తలెత్తసాగింది. కొంచెంసేపు ఇద్దరం ఊరుకున్నాం.

"అసలు సంగతేమిటో చెప్పండి, అట్టే బాధపెట్టక" అన్నాడు స్వామి.

"థార్ కమిటీ నివేదిక చూడండి. భోరుమని ఏడ్చేలా ఉంది. భాషాప్రయుక్తరాష్ట్ర విభజన ఎన్నటికీ పనికిరాదుట!"

"ఓస్! ఇంతేనా? దీనికేనా ఇంత గల్లంతు చేస్తున్నారు?" స్వామి చప్పరించి కుర్చీలో జార్లపడ్డాడు.

నాకు విచారమేసింది. ఆయనంత చులాగ్గా తీసి పారేస్తున్నందుకు.

"అయితే ఇప్పుడు మీ అభ్యంతరమేమిటి?" అన్నాడు స్వామి మళ్లీ.

నాకు నవ్వాలో, ఏడ్వాలో తెలీటంలేదు.

"నా అభ్యంతరం ఏమిటి అని అడగడంలో మీ వుద్దేశం అర్థమవడంలేదు. 'ఆంధ్రుడు' అనే వాణ్ణి ఏ పదవిలోకి రాకుండా చేస్తున్నారు! కేంద్ర ప్రభుత్వంలో ఎంతమంది ఆంధ్రులున్నారు? విదేశీరాయబారుల్లో ఆంధ్రు లెంతమంది? యు.ఎన్.ఓ. డెలిగేట్స్‌లో ఆంధ్రుడెవడు? ఆంధ్ర దేశంలోని ప్రాజెక్టులను దేన్ని ప్రభుత్వం తీసుకుంది?! వీటికి సమాధానం రాదు. ముప్ఫై ఏళ్ళనించి "రాష్ట్రమో" అని ఏడుస్తుంటే స్వరాజ్యమొచ్చినా దిక్కులేదు? ఇంతకంటే ఏం కావాలి?"

"మన పట్టాభి రాష్ట్రపతికదూ?" అన్నాడు స్వామి వికటంగా, సానుభూతిపూర్వకంగా,

"అవును–అదో కన్నీళ్ల తుడుపు! అందరూ నాలుగైదుసార్లు అవగా మిగిలింది–అదైనా పోటీలో కష్టపడిజయిస్తే వొచ్చింది. (తక్కినవాళ్ళకి నిరాశకలిగేలా) అయినా ఇప్పటి రాష్ట్రపతి అధికారాలు ఎంతవరకూ అనేది ఇంకా అనూహ్యమే!"

ఆకాశంలోని శూన్యంలోకి కిటికీలోంచి చూడసాగాను, పిచ్చిగా.

"అంతకంటె మీకు కావల్సిందేముంది. మీవాడు రాష్ట్రపతి! సంతృప్తిపడండి. చాలు!" స్వామి ఆంధ్రుడు కానట్టుగా మాట్లాడుతున్నాడు.

కుర్రాడు కాఫీతెచ్చి యిచ్చాడు. ఇద్దరం దాన్ని తాగాం. నేను మళ్ళా అనసాగాను:

"ఈవేళ మీ రెంచేతో పరధ్యానంగా వున్నారు"

అది నిజంకాదు, వొచ్చిన ఖర్మమేమిటంటే మీరు ఆంధ్రుణ్ణని మర్చిపోయారు. లేకపోతే అంతగా బాధపడరు! మీరు ఆంధ్రులు! మీరు చచ్చినా రాష్ట్రం రాదు! ఇది గుర్తుంచుకున్నప్పుడు, మీరు పరిస్థితుల్ని నా అంత తేలిగ్గానూ చూడగలుగుతారు."

"నాకు మీరు చెప్పేది అర్థమవడంలేదు" అన్నాను చికాకుగా.

"అర్థంచేసేందుకే ప్రయత్నిస్తున్నాను. అసలు సంగతేమిటంటే మన్నీ, మన నాయకుల్నీ, కేంద్ర ప్రభుత్వంలోనివాళ్లూ. తక్కినవాళ్ళూ అర్థంచేసుకున్నట్టు, మన్ని మనం అర్థంచేసుకోలేదు. లేకపోతే మనకి రాష్ట్రం ఎప్పుడోవొచ్చేది"

"మీ మాటల్లో సినిసిజం ధ్వనిస్తోంది" అన్నాను మళ్లీ.

స్వామి తీవ్రంగా అనసాగాడు. నా మాటలతో : "లేకపోతే ఏమిటి చూడండి? వాళ్లు వాళ్లంతట రాష్ట్రమిస్తారనుకోడం వొట్టి తెలివి తక్కువపని. అదెప్పటికీ జరగనిమాట. బ్రిటిష్‌వాళు ళ్ళ స్వాతంత్ర్యం యిచ్చినట్టే. మనవాళ్ళు ద్రాక్షపళ్లకోసం నోరు తెరుచుకుని కూచునే నక్కలా ఎదురుచూస్తారు కాని తగిన ఆందోళన లేవదీస్తారేమో చూడండి. దేశ చరిత్రలో గొప్ప పాత్రధరించవల్సిన ఆంధ్రజాతి రాష్ట్రాన్నే పొందలేకపోతే తన పాత్ర యింకేం నిర్వహింప కలుగుతుంది. పెద్ద ఉద్యమంలా, ప్రళయంలా, ప్రభుత్వం స్తంభించిపోతుందా అనేటట్టు కేంద్ర ప్రభుత్వానికి తోపించేలా చెయ్యాలి. అంతవరకూ మీ రోదనలు తాటాకు చప్పుళ్లల్లానే ఉండిపోతాయి. ఇలాంటిది ఆంధ్రులు చేస్తారనుకోడం, చెయ్యగలుగుతారనుకోవడం, అసంభవాల్లో వొకటి. అందుకే ముందరే అన్నాను 'మీరు చచ్చినా రాష్ట్రం రాదు' అని.

స్వామి పూర్తిచేశాడు. మన ప్రజలు ఆలాంటి ఉద్యమం లేవదీయగలరా? అని ఆలోచించు కోసాగాను నేను.

*13. 01. 1949–తెలుగు స్వతంత్ర వార పత్రిక*